# ఎదగని మనుషులు

పాపం రిక్షా సూరన్న అకస్మాత్తుగా చచ్చిపోయాడు. చచ్చిపోయిన నాటికి అతనికి భార్యవుంది. పేరు గైరమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. ఒకడు అయిదేండ్లవాడు, మరొకడు ఆరేండ్లవాడు. గైరమ్మ పిల్లలను దగ్గరకు తీసుకొని ఏడ్చింది. వూరికీ, రిక్షావాడకూ దూరంగా ఓ మెట్టమీద మకాం పెట్టడంవల్ల ఆమెను ఎవరూ ఓదార్చడానికి రాలేదు. ఆమె చెంపలమీద కన్నీళ్ళను ఎండబెట్టి పాపం గాలి చల్లగా ఓదార్చింది. . గైరమ్మ గుండెలు గట్టిపరచుకుంది. పొంగి పొంగి వచ్చే దు:ఖాన్ని చెంగుతో తుడిచినేసింది.ముందు ఏమి చెయ్యాలో దిక్కులు తోచని పరిస్థితులను ఆలోచనల గుడ్డలోపోసి వడకట్టింది. ఒకసారి మూటలు మోయాలను కుంది. కుర్రవాళ్ళను వాళ్లింటి దగ్గర, వీళ్ళింటి దగ్గర పిల్లల నెత్తుకునే పనికి పెట్టాలని అనుకుంది. మరొకసారి అంట్లు తోమాలనుకుంది. ఎందుకనో ఛీఛీ అనుకుంది. అల్యూమినియం కంపెనీలో చక్రం తిప్పితేనో.... తాపీమేస్త్రీకి ఇటుకలందిస్తేనో, అనుకుంది. అప్పుడే ఆమె మనసులో గారపళ్ళ తాపీమేస్త్రీ అవతరించాడు. పచ్చిబూతులతోనే బతికే ఆ మేస్త్రీ, నోటికొచ్చినట్లు యిచ్చకాలాడి, మంచినీళ్లు తెమ్మని, చేయి పట్టుకున్నట్లు ఆమెగుండె గిలగిల లాడింది. 'సూరన్న బావకు నాను సస్తే అపచారం చెయ్యను. నా దేవుడు నా సూరన్న బావ' అని కళ్లంట నీళ్లు పెట్టుకుంది. ఒకసారి సూరన్నబావ కళ్ళముందు తిరిగాడు. గుండెల్లో కదిలాడు. గుడిసెలోనూ, గుడిసె చుట్టూ ఉన్నట్లే కనుపించాడు. కాళీగావున్న ఆ రిక్షాసీటుమీదే కూర్చున్నట్లు మెదిలాడు... నీళ్ళబిందెలో తల వూపాడు. పిల్లల కళ్ళల్లో తళతళలాడాడు. గైరమ్మ పిల్లల్ని గట్టిగా కౌగలించుకుని, ఏడ్వబోయింది. అప్పుడే ఆమె వీపుమీద సూరన్న బావ నీ కేమీ భయం లేదని తట్టినట్లయింది. వెనక్కు తిరిగి చూసింది. వెనుక చెట్లు నిలిచివున్నాయి. ఆ చెట్లమీద కిరణాలు చిత్రంగా మెరుస్తున్నాయి. గైరమ్మ దేవుడికి దండం పెట్టింది. పిల్లలను

గుండెలకు చేర్చుకుంది. పొంగి వస్తున్న దు:ఖాన్ని హాలాహలంలా మింగింది.

గైరమ్మకు గతం గుర్తుకొచ్చింది. గతంలోని వెన్నెల ఆమె ముందు పరచుకుంది. ఆ దిబ్బమీద వెన్నెల పకపకా నవ్వింది. సూరన్న చేతిలో గైరమ్మ పయిటచెంగు మిగిలిపోయింది.

"ఈ రిక్షామీద కూర్చోవే.... ఈ దిబ్బసుట్టూ తిప్పుతాను" అనేవాడు.

"కూసుంటానుగానీ, నీకు బాడుగెక్కడనుండి తెచ్చేది బావా....తిప్పి తిప్పి డబ్బులు తెమ్మంటే నా నేటి సేసేది" అనేది. చిన్నారి చిగురుటాకుల్లా నవ్వేది.

సూరన్న మురిసిపోయేవాడు. "ఒక్క ముద్దియ్యవే సాలు" అనేవాడు.

గైరమ్మ గలగలా నవ్వి "ముద్దుల కేటి బావా. కొనాలా పెట్టాలా.కానీ ఖర్చునేదు, అవంటే నాకు భయంనేదు బావా.....డబ్బు లిమ్మంటేనే నాకు భయం" అనేది.

వెంటనే సూరన్న గ్రహించేవాడు. "ఓసి ముండా! బలేదానివేనే! నాను సెప్పానుగదే....ఇక సత్తే నిన్ను డబ్బడగనని... నీ మీద ఒట్టు. ఇక పాణంపోయినా కల్లుమొగం సూడను" అనేవాడు.

గైరమ్మ "సూత్తానుగా ఏపాటి నిలకడో......." అనేది. సూరన్న మీసం మెలేసేవాడు. "మాటంటే మాటేనే" అనేవాడు.

గయిరమ్మ వదిలేది కాదు. "ఇప్పుడిలాగే అంటావు. ఆనక పానం గిల గిల్లాడిపోతూందని జాలిగా మొగమెడతావు. ఆ ఎదవ కల్లుకోసం నన్నే మరిసి పోతావు" అనేది.

సూరన్న ఓడిపోయేవాడు. రిక్షా విడిచిపెట్టేసి, గబాలున ఆమె దగ్గరకు ఒక్క ఉరుకు వురికి, కౌగిలించుకోబోయినంత పనిచేసి, "నాకు డబ్బులొద్దే.....నువ్వే కావాలి...నువ్వే..నిజం తల్లితోడు..." అనేవాడు.

గైరమ్మ అతనికి దూరంగా తొలిగి, పకపకా నవ్వి, "అయితే, నువ్విలా కూసోబావా...పొద్దుటి నుంచీ అలిసిపోయావుకదా.... ఈ రిక్షా నాను తొక్కుతాను, నిన్ను హాయిగా తిప్పుతాను. సల్లగా ఉంటాది...." అని రిక్షా సీటు మీద కూర్చునేది.

"నీ దుంపతెగా... నువ్వెప్పుడు నేర్చుకున్నావే...ఇంత ఉసారుగా తొక్కేత్తున్నావు." అంటూ, ఆమె నలాగే సందిట పొదవుకొని రిక్షా సీటులోనికి లాగేసుకునేవాడు. ఇద్దరి నవ్వులూ, ఆ గుట్ట గుట్టంతా ధ్వనించేవి. చుట్టూవున్న చెట్ల ఆకులన్నీ గుడిలోని చిరుగంటల్లా, మధురంగా కదిలేవి!

గతమంతా గయిరమ్మ కళ్ళల్లో కన్నీటిలా నిలిచింది. రిక్షా దగ్గరకు వెళ్ళి

వెక్కివెక్కి ఏడ్చింది. రిక్షా ఫెడలు మీద తలపెట్టి కుమిలిపోయింది. ఆ ఫెడలు ముట్టుకుంటే పాప మామె మనసు సూరన్న పాదాలు ముట్టుకొన్నట్లే తృప్తిపడింది.

రోజులు పల్లానికి ప్రవహించకుండా ఉండలేని నదీ జలంలా, ముందుకు వెళ్ళకుండా ఉండలేక పోతున్నాయి. మునుముందుకు వెళ్ళటం రోజుల కెంతసహజమో దినదినం ఆకలితీర్చుకోవలసిన అవసరమూ, ఈ మనుషుల కంత సహజము. ముందుకు వెళ్ళకపోతే యీ భూమికి మరి పుట్ట గతులు లేనట్లే, ఆకలి తీరకపోతే మనిషికీ మరి ఈ భూమ్మీద నూకలుండవు.

పాపం గయిరమ్మ ముందుగా రిక్షాను అమ్మివేసి, ఆ డబ్బుతో ఏదో పని చూసుకునేవరకు కాలం వెళ్ళబుచ్చాలనుకుంది. కానీ ఆ రిక్షాను అమ్మాలంటే తన ప్రియుణ్ణి అమ్ముకుంటున్నట్లు బాధపడింది. భార్య నమ్ముకున్న హరిశ్చంద్రుడిలా గిలగిల్లాడిపోయింది. ఆ రిక్షాను అమ్మడానికి ఆమెకు చేతులురాలేదు. అయినా తప్పేటట్లులేదు. కానీ కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి అన్నట్లు దానిఖరీదులో సగంకూడా వచ్చే ఆశ ఆమడ దూరమైంది. గైరమ్మకు ఏ పని చేయడానికీ పాలు పోలేదు. కొందరు రిక్షాలు తొక్కేవాళ్ళొచ్చి, ఆ రిక్షాను బాడుగ కిమ్మని గైరమ్మను బ్రతిమాలారు. కానీ ఇందుకూ ఆమె మనస్సొప్పలేదు. వాళ్ళెంత చక్కగా ఆ డబ్బులు తీసుకొచ్చి తనచేతిలో పెడతారో, ఆమెకు బాగా తెలుసు. ఆపైన వాళ్ళతోవచ్చే గొడవలతో, అంతూ దరీ వుండదు. సైకిలుని ఎట్లాపొందిగ్గా చూడాలో, అట్లా వాళ్ళు చస్తే చూడరు. విసురుగా తొక్కుతారు. దేన్నో విరుగగొడతారు. యిదేమిటంటే మమ్మల్నేం చెయ్యమంటావ్.....అంటారు. చక్రంలో గాలి ఉన్నదీ, లేనిదీ చూడరు. రోజుకో ట్యూబు పగలగొడతారు. ఈ విధంగా వాళ్ళతో అన్నీ చిక్కులే. అన్నీ నష్టాలే.

గైరమ్మకు ఆ సైకిలుకు సంబంధించిన అన్ని పనులు తెలుసు. ఆయిలు పోయగలదు. శుభ్రంగా తుడిచి చైను వూడిపోతే చైను తగిలించగలదు. చక్రంలో గాలి తగ్గిపోతే గాలి నిమిషాల మీద కొట్టగలదు. సామానులు లేవుగాని పూర్తిగా ఆ సైకిలంతా విప్పిపారేసి ఇట్టే బిగించగలదు.

ఆ రాత్రి గైరమ్మకు ఓ విచిత్రమైన వూహ తట్టింది. ఆ వూహతో ఆమె గుండె గజగజలాడిపోయింది. అయినా ఆమె ఆ వూహకే కట్టుబడి వుండాలని నిర్ణయించుకుంది. సూరన్న బావను తలచుకుంది. నీవే నాకు రక్ష అని మొక్కింది. పొద్దున్నే లేచింది. స్నానంచేసింది. సూర్య నారాయణమూర్తికి దండం పెట్టింది. కచ్చా బిగించింది. పైట చెంగు బొడ్డులో దోపింది. ఇంటిని కనిపెట్టుకొని ఉండమని

పిల్లలతో చెప్పి వాళ్ళను గుండెలకు హత్తుకొని ముద్దు పెట్టుకుంది. విప్లవ రేఖలా సైకిలు రిక్షాను చేరి స్వతంత్రంగా బతకడానికి ముందడుగు వేసింది.

ఆరోజున లోకం తలక్రిందులైపోయింది. రిక్షామీద గైరమ్మను చూడగానే ఆడది రిక్షా తొక్కట మేమిటని జనం వీధిలో విడ్డురంగా మూగారు. కొందరు ముక్కుమీద వేలేసుకున్నారు. కొందరు 'అవ్వ....అవ్వ....' అని నోరు నొక్కుకొన్నారు. 'కలికాలం' అని మరికొందరు వాపోయారు.

ఆడవాళ్ళు రిక్షా త్రొక్కడం ఎక్కడా చూడలేదు. ఎవరో గట్టిగా కళ్ళు తెరిచారు. కళ్ళద్దాలల్లోంచి తేరిపార చూశారు. ఒక వేళ పొరపాటు పడ్డామేమో అనుకుంటూ మగవాడేమోనని తిరిగి తిరిగి జాగ్రత్తగా పరిశీలించారు. మరీ మరీ ఆమెవైపు గుచ్చి గుచ్చి చూశారు. ఒకటోరకం ఆడదేనని నిర్ధారణ చేసుకున్నారు.

'బాగుందబ్బాయి... బాగుంది ఆడవాళ్ళు చేయులేని దేముంది. రాజ్యాలేలుతున్నారు. రౌడీలుగా మారుతున్నారు. రిక్షాలు తొక్కుతున్నారు. రీజనల్ ఆఫీసర్లు అవుతున్నారు. ఓహోహో బాగుంది బాగుంది' అన్నాడు ఓచోటా పొలిటీషియన్.

'అరే అది కాదురా తమ్ముడూ. ఇందులో ఏదోకథ వుండి వుంటుంది. యీ రిక్షా రాణిగారి అంతర్వాణి యీ విషయంలో ఏంపలుకుతుందో కాస్త పలికించి చూడు.

'ఔనౌను అడగాలోయ్. అడగాలి. ఇదిగో ఓ రిక్షా అమ్మీ.....నువ్వెందుకు తొక్కుతున్నావు....రిక్షా.....ఇలా అడిగినందుకు మరేమీ అనుకోకు....'

గైరమ్మ రిక్షా దిగింది. విడ్డూరాన్ని ముఖంలో తోముకున్న జనాన్ని నిలువునా చూసింది. "ఎందుకు తొక్కుతానో మీకు లెలియదా బాబూ" అంది.

'అబ్బే....అబ్బే....తెలిస్తే ఎందుకడుగుతాం....'

'కడుపుకోసంబాబూ'.

'ఏమిటీ...కడుపుకోసమా....రామరామ....లోకం ఎంత పతనమైపోయింది. ఏమిటమ్మా సరిగ్గా చెప్పు నాకర్థ మవలేదు......'

'ఏటి సెప్పను బాబూ....మీరు సదువుకున్నోరు అన్నీ తెలిసినోరు తెలియనట్లు మాటాడితే ఏమి సెప్పను...కూడులేనోళ్ళ బాధలు కుక్కలకు తెలియవు.....'

'అర్థమైందమ్మా... అర్థమైంది. అయితే యీ వూరంతా నీకు తెలుసా.....'

'తెలియకేం బాబూ... మీ రెక్కడికి తీసికెళ్లమంటే అక్కడికి తీసికెల్తాను.....'

'వండర్‌ఫుల్....వండర్‌ఫుల్...మనం ఎక్కడికి తీసుకుపోతే అక్కడకు వచ్చేస్తుంది, ఎవరో వినబడీ వినబడకుండా నవ్వుల్తో ఆ మాటలను నలిపేశారు. బహుశా కాలేజీ

విద్యార్థులై వుంటారు.

గైరమ్మ కళ్ళల్లోంచి ఎర్రని చూపు సూటిగా వారివైపు జ్వలించింది. ఆమె ఏమీ మాటాడలేదు.

'కట్టమంటారా బాబు....' అంది మెల్లగా.

'మరి నువ్వు కిందికి బోల్తా కొట్టించకుండా ఉంటావని పూచీ ఏమిటీ? దెబ్బలు తగిలినా ఏమీ ఫరవాలేదు కాని కట్లు అవీ కట్టించుకోవడం అంటే మాకు సుతరామూ ఇష్టముండదు.'

'చాలా బాగా తొక్కుతాను బాబూ...... మీరు సూత్తారుగా....'

'ఔనౌను చూస్తాం... వంటినిండా దెబ్బలు తగిలితే ఎంత చక్కగా తగిలాయా అనిచూస్తాం. కొత్త చొక్కా తొడుక్కున్నప్పుడు చూసుకోమూ అలా చూస్తామన్నమాట. ఇంతకీ నీకు లైసెన్సువుందా.....'

'ఉంది బాబూ.....'

'ఏదీ చూపించు.....'

'ఇదిగోనండి.....'

అప్పుడే ఓ రిక్షావాడు జొరబడి, 'ఇది దీన్ది కాదండి... దీని మొగుడిది....' అన్నాడు.

అందరూ గొల్లున నవ్వారు.

'ఎందుకు నవ్వుతారు. యీ రిక్షా మా సూరన్న బావది. ఆడు సచ్చిపోనాడు. ఇప్పుడు నాదేకదూ...... యీ లైసినీసు ఆడిదే... ... మరి నాకు సెందదూ........' అంది.

అందరి ముఖాల్లోనూ ఒక్కసారి ఏమిటేమిటీ అన్నట్లు 'కళ' కళవళ పడింది. పైకీ క్రిందికీ లేచిపడే కెరటమైంది.

'ఇదేం వోరసత్తంఅనుకున్నవేటే గయిరమ్మా... లైసినీసులకు వోరసత్తాలుండవు'

ఔను, నిజం. మంత్రికొడుకు మంత్రి కావాలనిలేదు. గుమాస్తా కొడుకు గుమాస్తా కావాలనీలేదు. ఈ కాలంలో దేనికీ వారసత్వం లేదు.

'వూరుకోండి బాబూ నాకు తెలీపోతే మరీ సెప్పుతారు. మా మునిసీబు గోరబ్బాయి మునిసీబయ్యాడు. కరణం గోరబ్బాయి కరణమయ్యాడు. వున్నమాట సెప్పండి బాబూ.'

"బాబోయ్... ఇది టక్కరి ముండండీ.... దీని రిక్షా ఎక్కకండీ... ఆడోళ్ళ రిక్షా లెక్కితే పాడైపోతారు. నామాట ఇనండీ....."

గైరమ్మ కుతకుతలాడిపోయింది. "మగోళ్ళ రిక్షా లెక్కిన ఆడోళ్లందరూ

సెడిపోతున్నారా ఏటి... రండి భాబూ......"

"నాను సెప్పానుగదండీ.... ఇది దొంగముండని"

"ఎవడవురా నువ్వు నన్ను తిడతావు....."

"ఎవతివే నువ్వు మాకు పోటీగా వస్తావు...ఒరే రిక్షా తమ్ముళ్ళూ రండిరా.....రండి...ఇక మనకు బతుకుల్లేవు, ఆడోళ్ళు రిక్షాలు తొక్కేత్తున్నారు. మన మగోళ్ళరిక్షాలు మగోడెవ్వడూ ఎక్కడు. తొందరగా రండ్రొరేయ్...దీనికి బుద్ధి సెప్పకపోతే నాభం నేదు."

ఈ సంభాషణంతా విన్న నల్లకోటు తొడుక్కున్న కళ్ళజోడు లేని కుర్రప్లీడరు, గైరమ్మ మాట్లాడిన విధానానికీ ధైర్యానికీ ఆశ్చర్యపోయాడు. గభాలున ఆ గుంపులోకి చొరబడి –

"ఎవడివయ్యా నువ్వు ఆ అమ్మిని రిక్షా తొక్కకుండా ఆపడానికి? నువ్వెలా బతుకుతున్నావో, ఆ అమ్మీ అలాగే బతుకుతుంది. బతకడం అందరి జన్మహక్కు, ఆమె కష్టించి బ్రతుకుతానంటోంది కానీ దొంగపనీ దొసగుపనీ చేయటంలేదు. భారత రాజ్యాంగం ప్రకారం ఆమె తరుపున న్యాయం పూర్తిగా వుంది."

"ఈ యవ్వారం ముదిరిపోతోంద్రరోయ్ రండి, రండి, పీడర్లు కూడా వచ్చేత్తున్నారు ఈ భాగోతంలోకి. ఆడోళ్ళంటే అందరికీ అతిమానమే... (అభిమానమే)...."

"పోనీ, ఆడోళ్ళయినా ఎక్కండమ్మా నా బతుకెల్లిపోద్ది...."

"తప్పు తప్పు అలా అనకమ్మా! నిన్ను బాధపెట్టటం మా కిష్టంలేదు. ఇది భారత స్త్రీజాతికే కళంకం. మేం నీరిక్షా ఎక్కేటంత... ఆటవికత్వం మాలో లేదు.

"అలా అనకండి తల్లీ... చక్రాలు తిప్పుతున్న సిట్టి సెల్లాయిలున్నారు. దంపుళ్ళు దంపుతూన్న పెద్దక్కలున్నారు. ఒటేళ్ళలో రుబ్బనేక సేతులు పడిపోతున్న ఆడబడుసు లున్నారు. మిల్లుల్లో బల్లులైపోతున్న తల్లులున్నారు. నన్నీపని సేసుకోనీండమ్మా...మీరే సిన్నసూపు సూత్తే ఇక నా బిడ్డల గతేటి తల్లీ...."

"అబ్బో! యిది శానా సదువులు సదివిందండోయ్... మన సంఘంముందు దీని సంగతేటో తేల్సుకోవాలి....సంగం నాయుడ్ని రంగంలోకి తీసుకు రావాలి.... పదండ్రా, పదండి....."

అప్పుడే ఓ పోలీసు వచ్చి, 'ఏమిటీ గుంపు యిక్కడ నుంచి పోండి, అన్నాడు,

"ఏమండోయ్! పోలీసయ్యగోరూ! ఆడది రిక్షా తొక్కుతూందండీ, దీని సంగతేటో

సూడండీ.'

"ఆడోళ్ళు రిక్షా తొక్కడమేమిటోయ్ నీ ముఖం"

"నిజం బాబూ! నాను శానాబాగా తొక్కుతానండీ....."

"ఏమి టేమిటీ? నువ్వు రిక్షా తొక్కుతావా?"

"ఔను బాబూ!"

"అదెల్లా వీలవుతుంది. ఆడోళ్ళు తొక్కడం నే నెప్పుడూ చూడలేదే...."

అప్పుడే ప్లీడరు కలుగ జేసుకొని 'ఇప్పుడు చూస్తున్నావు కదటయ్యా! ఇంకేం చూడాలి....'

'అదేమిటండీ! మీరుకూడా అలా అంటారు.'

'ఏం? ఆమె హక్కును కాదనమంటావా?'

' హక్కులంటూ చిక్కులు తెచ్చిపెట్టకండి ప్లీడరు గారూ... మొండివాదనలు మానేసి, నిండైన మాట చెప్పండి' ఎవరో పెద్దమనిషి గొణిగాడు.

'అది కాదండీ! నా మాట వినండీ! ఆమెను చూస్తూవుంటే జాలేస్తోంది. భర్త చచ్చిపోయాడు. పాపం పిల్లల్ని పోషించాలి. ఆమెకీపని చేతనౌను. ఇలాంటి పరిస్థితులలో ఏ ఆడదయినా ఇంకేం చేస్తుంది?'

'మరో ఆడదయితే అంట్లు తోముతుంది'

'ఏమండోయ్ మీరు పెద్దమనిషిగా మాట్లాడటం లేదు. ఆమెను కించపరచటం ఏమీ సబబుగాలేదు. మీరు బిజినెస్ మానేసి, బంట్రోతు ఉద్యోగం చెయ్యమంటే చేస్తారా?'

'మీ సబబులు, సందర్భాలు కట్టిపెట్టండి. అసలు లోకంలో ఎవరికీ యిష్టంలేని పని చెయ్యడానికి ఆమె కేం హక్కు వుందండీ?'

'ఎవరికీ యిష్టంలేదని మీ రెల్లా చెప్పగలరండి! అయినా, అందరికీ యిష్టంలేదన్నంత మాత్రంలో న్యాయం అన్యాయంగామారిపోతుందేమిటీ? అందరూ సూర్యుడు నల్లగా వున్నాడంటే కుదురుతుందేమిటి?'

' ప్లీడరుగారూ ఎందుకండీ అనవసరంగా రొప్పుతారు. పదుగురాడు మాట పాటియై ధరజెల్లు, మన మందరమూ ఏదంటే అదే న్యాయం....'

'ఆ రోజులు పోయాయండీ పుల్లయ్యగారూ.... మనమందరమూ అన్నంత మాత్రంలో అది న్యాయమైపోదు. ఏది న్యాయమో అది న్యాయమవుతుంది.'

'నిజం.....నిజం....ఏది న్యాయమో అది న్యాయమవుతుంది. ఏది వంకాయో అది

వంకాయే అవుతుంది. ఎవడు ప్లీడరో వాడు ప్లీడరవుతాడు.... ఎవడు కూలీయో వాడు కూలీ ఔతాడు. నిజం...నిజం... ప్లీడరుగారూ....ఇంటికి వెళ్ళి చిన్న ముక్కాలిపీట వేసుకొని ఆబోర్డు కాస్తా వెనక్కి తిప్పండి....ఎందుకైనా మంచిది.'

అందరూ మల్లెపూలగంప తిరగబడినట్లు విరగబడి నవ్వారు.

పోలీసు కలుగ జేసుకొని నడిరోడ్డుమీద నిలబడి న్యాయా న్యాయాలు నిర్ణయించడం కష్టం సార్.... ఇదిగో అమ్మీ... నీకు లైసెన్సు లేదు. అంచాత నువ్వు రిక్షా తొక్కడానికి వీల్లేదు. తిన్నగా ఇంటికి వెళ్ళు. లేకపోతే కేసు పెట్టవలసి వస్తుంది.'

వెంటనే ప్లీడరు, 'ఇదిగో నువ్వేం భయపడకు...నీకు లైసెన్సు తెచ్చిపెట్టే బాధ్యత నాది. వీళ్ళంతా అప్పుడేం చేస్తారో చూస్తాను.'

'పోనీ బాబూ.... ఇందరి కిట్టంలేని పని నేను చేసి ఏం బావుకుంటాను...మరో పనేదో సూసుకొని పొట్టగడుపు కుంటాను.'

'అలా ఎప్పుడూ వెనుకడుగు వేయకూడదు. నీకెందుకు నేనున్నానుగా! రేప్పొద్దుట మీయింటి కొస్తాను. నువ్వు సిద్ధంగా ఉండు. నేను నిన్ను ఆ ఆఫీసుకు తీసుకుపోయి లైసెన్సు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాను.'

వెంటనే అక్కడున్న రిక్షావాళ్ళు 'ఎలాగిత్తారో మేం చూత్తాంగా.... మేమేంఅంత గాజులు తొడిగించుకొని కూచోలేదు.'

'ఒరేఒరే... అలాగనకురా...దానికి గాజుల్లేవు, అది మగోడుకన్నా మగోడులా ఉంది.'

'ఉండరా నువ్వేటి...ఇదిగో గయిరమ్మా మేం సెప్పేదినుకో....నీకు లైసినీ సొచ్చినా, మేం నిన్ను సైకిలు తొక్కనివ్వం. అంతే....ఏటనుకున్నావో.... మళ్ళీ సెప్ప లేదనేవు. మరసిపోకు సుమీ....'

ప్లీడరు ఎర్రగా వాళ్ళవైపు చూసి, 'ఈ దౌర్జన్యం కబుర్లు కట్టిపెట్టండి. లైసెన్సు పుచ్చుకోడం ఈ రోడ్డుమీద ఈ యమ్మి రిక్షా తొక్కడం తప్పకుండా జరుగుతుంది. మీరు కాదు, మీ తలలోని జేజెమ్మకూడ దీన్ని ఆపలేరు' అని, గయిరమ్మను దగ్గరగా పిలిచి ఆమెపేరు, ఇంటి పేరు కనుక్కొని, నీకేం భయంలేదని అభయహస్తం ఇచ్చి, ఇంటికి వెళ్ళిపోయాడు.

గైరమ్మ మెల్లగా సైకిలు నడిపించుకుంటూ దీనంగా ఇంటివైపు దారితీసింది. చుట్టూ ఉన్న జనం వెర్రినవ్వు నవ్వుతూ అటూ ఇటూ కదిలి పోయారు.

రిక్షావాళ్ళు గయిరమ్మను నానా బూతులు తిడుతూ 'తెగించింది ముండ'

అన్నారు. 'మనం కాస్త జాగర్తగా. ఉండాల్రోయ్. ఆపొట్టి పీడరు మాగట్టోడు....' అనుకున్నారు.

# 2

ఇంటికి వెళ్ళగానే ప్లీడరు శేషగిరికి అనంతమైన ఆలోచనలు పుట్టుకొచ్చాయి. భార్యామణిని పిలిచాడు. 'లీలా.... ఒక్కమాట, ఇలా నాముందు కాస్సేపు కూర్చో....' అన్నాడు.

లీల కాస్త దూరంగా నిలిచి నవ్వుతూ కళ్ళతోనే ఏమిటి విశేషమంది.

' చెపుతా మాట' అన్నాడు.

'అన్నం తినేసి ఆమాటలు చెప్పుకోగూడదూ, ఏమంత కంగారు.'

'ఆఖండమైన కీర్తి నా కాళ్ళముందు నిలచి ఉంది లీలా...కౌగిలించుకోవాలో... దూరంగా తొలగిపోవాలో తోచకుండాఉంది. కాస్త దగ్గరగా రా... మరీ అంత దూరంగా ఉండకు. దూరంగా ఉండి చెప్పే సలహాలకు ఉండవలసినంత బలం ఉండదు....'

'మీకు కావలసింది కీర్తి కాని నేను కాదుకదూ... దూరంగా ఉంటే మాత్రం ఏం... అదేం ఖర్మో...ఈభర్తలకు కీర్తి కావాలి.పాపం భార్యలకు మాత్రం భర్తలే కావాలి. ఛీ.ఛీ... ఏం కాపురం...'

'నోనో... భర్తలకు కీర్తి ఎలా కావాలో భార్యలకు అలాగే మరి డబ్బు కావాలి. నాకు కీర్తి ఎలాగూ వస్తుంది. నీ దగ్గర కావలసిన డబ్బు ఉండనే ఉంది. అంచాత మన కాపురానికేం బంగారంలాంటి కాపురం....'

'మీ ఒడుపుల కేంలెండి... ఈ సారి నేను ఛస్తే డబ్బివ్వను.'

'అబ్బబ్బ...ఎప్పుడూ డబ్బు మీదేకదా బెంగ! వెధవది డబ్బు తగలేస్తేనేగాని కీర్తి రాదు. కీర్తిని పాడుచేసుకుంటేనే గాని డబ్బు పుట్టదు. చూడు లీలా నన్నేం తగలెయ్య మంటావ్...'

'మీ కిష్టం వచ్చింది తగలేసుకోండి... నాకేం. నాకు ఆకలేస్తోంది. నేనుపోతా....'

'ఆకలి మనకోసం పుట్టింది లీలా... ఆకలికోసం మనం పుట్టలేదు. మనకోసం వచ్చిన పెద్దమనిషి వీధి అరుగుమీద ఎంత సేపైనా నిలబడతాడు. తెలుసుగా. అంచాత మనకోసం పుట్టిన అన్నమూ అంతే....'

'సరే మీకోసం పుట్టిన ఆ 'అన్నం పెద్దమనిషి' గారు వచ్చేవరకూ మీరక్కడే కూర్చోండి. నేను పోతా.'

'మై గుడ్‌గాడ్... ఇహ లాభంలేదు. ఇదిగో లీలా నేనూ వస్తున్నా....కాని, ఒక్కటి చెప్పు. నువ్వు ఆడాళ్ళను ప్రేమిస్తావుకదూ....'

'ఏం... ఎక్కడైనా ఓ అమ్మాయిని చూసుకున్నా రేమిటి...'

'రామ... రామ...ఎంతమాటన్నావ్... అదికాదు లీలా...నీకు ఆడవాళ్ళు ఎలాంటిపనులు చేయడం ఇష్టం?'

'టెన్నిస్ ఆడటమంటే నాకు చాలా ఇష్టమండీ...'

'ఒహో చాలబాగుంది 'తరువాత?'

'హాయిగా కారులో బీచిఒడ్డుకు షికారుపోవడం ఇష్టమండీ....'

'తరువాత...?'

'అక్కడ వేరుశనగ పప్పు తింటూ పైకీ క్రిందకీ ఉయ్యాలలూగే కెరటాలను చూస్తూ కూర్చోడం అంటే ఎంతో ఎంతో ఇష్టం'

'అద్భుతం...అద్భుతం. అయితే లీలమ్మగారూ ఒక్క మాటండి. ఆడవాళ్లు రిక్షాలు లాగడం తమకు ఇష్టమా అండి.'

'అదేమిటీ! ఛీఛీ.'

'పోనీ అంట్లు తోమడమో...'

'అసలిష్టంలేదు.'

' వెరీ గుడ్, రేపటినుంచి ఈ ఆంధ్రావనిలో అంట్లుతోమేవాళ్ళు ఉండకుండా చేసేస్తాను.'

'ఈవిధంగా డబ్బు ఆదాచెయ్యాలని చూస్తున్నా రేమిటి... ఎల్లుండినుండి మసి చేతులతో మీ పరువు పది మందిలో తీసేస్తాను.'

'అందరిళ్ళల్లోనూ మసి చేతులే ఉంటే నువ్వు తీసే దేమిటిలే పరువు... చూడు లీలా, నాయొక్క అసాధారణమైన తెలివి తేటలవల్ల ఈ అంట్లుతోమే పిల్లల స్టేటస్ రేపటినుంచి పెంచేస్తాను. అంట్లుతోమే పిల్లలు సాధారణంగా తెలివైన వాళ్ళయి ఉంటారు. వాళ్ళు బలంగా ఉండడం సరేసరి. తెలివి, బలం కలిస్తే ఈ జీవితపు సైకిలు తొక్కడం చాలా సులువు. అంచాత వాళ్ళంతా ఇహ రేపటినుంచి సైకిలు రిక్షాలు ఉషారుగా తొక్కుతారు.'

'ఏ పేపర్లో చూశారండీ యీ కార్టూన్? నన్నూ కాస్త చూడనిస్తారా...'

'పేపర్లేం ఖర్మ! పబ్లిక్ రోడ్డుమీద చూశాను. మన మస్తిష్కం దాన్ని ఫోటో తీసుకుంది. యీ లోకం ఆర్టుగ్యాలరీలో దాన్ని త్వరలోనే ఆవిష్కరిస్తాను. మరి చూసుకో మన తడాఖా....'

'ఎవరైనా వింటే నవ్వుతారు వూరుకోండి. ఇప్పటికే ఆడవాళ్ళకు బోలెడన్ని పనులు అంటగట్టి, మగాళ్ళు మొద్దుల్లా తయారవుతున్నారని ప్రపంచం గోలెత్తిపోతోంది. అయినా మీ కిలాంటి రాక్షసపు ఆలోచనలు పుడతాయేం..?'

'అలాగా పాపం....రిక్షాలులాగే మగవాళ్ళంతా రాక్షసులన్న మాట! మరి ఈ మగరాక్షసులను పెళ్ళాడేందుకు ఎంచక్కా ఆడదేవతలు దివినుండి దిగుతారు కాబోలు.'

'అయితే మొగుడు రిక్షా తొక్కితే పెళ్ళాంకూడా పాపం రిక్షా తొక్కాలా...'

'ఔను లీలా... ఔను. ప్లీడరు పెళ్ళాం ప్లీడరు... డాక్టరు పెళ్ళాం డాక్టరు, ఇంజనీరు పెళ్ళాం ఇంజనీరు అయితే... ఎంత సుఖం....'

'ఔనౌను. చాలసుఖం... రేపటినుంచి మంగలి పెళ్ళాం మజాగా తయారై ఉషారుగా క్రాపులు వేస్తే బలేసుఖం... బలేసుఖం.'

'వండ్రఫుల్ ఐడియా, ఏది షేక్ హేండియ్యి... లీలా నువ్వు నిజంగా ప్లీడరు పెళ్ళాని వనిపించుకున్నావు. నామాట కొంచెం విను.'

'మీ 'లా' ప్రకారం ఆ పనికి అంగీకారం కుదురుతుందేమోగాని, ఈ ఎదగని మనుష్యుల మధ్య ఇలాంటి పనులు జరగడం కల్ల.'

'మనుషులు ఎదగకపోతే నీ ఉద్దేశంలో మనిషి చావాలన్నమాట. ఎదగని మనుషులందరూ కలసి మనిషిని చంపెయ్యొచ్చన్న మాట.'

'అది తప్పే అనుకోండి.'

'అయితే నామాట విను. ఈ మధ్య ఓ రిక్షవాడు చచ్చిపోయాడు. అతని భార్య రిక్షా తొక్కగలదు. పిల్లల్ని పోషించడానికి, తన బ్రతుకును ఎలాగో ఈడ్చి పారెయ్యడానికి, ఈరోజున వీధిలో నిలబడింది. ఆమె మొఖంచూస్తే చాలు ఆమె ఎంతో పవిత్రమైనదని అర్థమవుతుంది. ఆమెలో ఏదురుద్దేశమూ లేదు. ప్రజల్ని వంచించాలని గాని, ఈ రకంగా ధనాన్ని సంపాదించాలనిగాని, ఆమెలో కొంచెం ఖూడ లేదు. కాని ఆమెను ఈ ఇరవయ్యో శతాబ్దపు మనిషి బతకొద్దని శాసిస్తున్నాడు. నువ్వు చెప్పు లీలా... ఆమె ఈ స్థితిలో ఏమి చెయ్యాలి? ఈ రాక్షసుల పిచ్చిభావాలకు ఆమె బలి కావలసిందేనా?'

'నిజమే, ఆమె బతకవలసిందే. కాని ఈ ప్రజలు సాగనిస్తారని నేననుకోను. అంత కల్చర్ ఇంకో యుగానికి కాని రాదు.'

'ఈ యుగంలోనే వస్తుంది లీలా..... నేనందుకు నాప్రాణాన్ని ఒడ్డి నిలుస్తాను. నీవు కొంచెం చేయూత నియ్యి. హైకోర్టు వరకూ వెళ్ళవలసి వచ్చినా రావచ్చు. ఇక్కడ ఏమంత ఖర్చు కాదుకాని, అక్కడకు వెళ్ళితే రానుపోను ఛార్జీలకు, భోజనాలకు, ఈలోగా ఆ మనిషిని కాస్త కాపాడటానికీ కాస్తపైకం కావలసి ఉంటుంది. దీనికి మరి నువ్వు కాస్త చల్లనిచూపు చూడాలి.'

'ఛా... అదేమిటండీ....అలా అంటారు. ఇలాంటి పనికి నేనివ్వనంటానా... దీనికింత ఉపోద్ఘాతమా....'

'నువ్వు ఇవ్వవని కాదు లీలా.... ఇందులో ఇంత కష్ట మున్నదని... ఇహ రేపటి నుంచే నేనీ పనిలో నిమగ్నుడనౌతాను. నెగ్గితే నాకీర్తి దశదిశలా వ్యాపిస్తుంది. ఈకేసులోని విషయాలు రేపటి విద్యార్థులకు పాఠాలుగా ఉంటాయి.'

'అలాగే జరుగుతుంది లెండి, లేవండి భోజనానికి'

'భార్య ఆశీర్వదిస్తే తప్పక ఫలిస్తుంది డార్లింగ్....' నవ్వుతూ శేషగిరి భోజనానికి కూర్చున్నాడు.

# 3

గైరమ్మ ఇంటి ముందు కూర్చుంది. పెద్దకుర్రాడు గుణింతం దిద్దుతున్నాడు. చిన్నవాడు తల్లి వీపుమీద ఉయ్యాల లూగుతున్నాడు. గైరమ్మ ఆకాశంలోకి చూస్తూ ఏమిటో ఆలోచిస్తోంది.

'అమ్మా నాకు పుస్తకం కొనిపెట్టవే' అంటూ పెద్దకుర్రాడు తల్లివైపు అదోలా చూశాడు.

'కొంటాలేరా... వేళయింది. అన్నం తిందువుగానిలే'అంది గైరమ్మ.

కుర్రాడు భయపడుతూ భయపడుతూ. 'నాకు ఆకలిగా లేదమ్మా....' అన్నాడు.

'ఏమి తిన్నావురా లేకపోడానికి... పద... అన్నం పెడతా...' అంటూ వీపుమీద వూగుతూన్న కుర్రాడ్ని 'నువ్వుండరా....' అని వాణ్ణిదింపి, లోపలికి వెళ్లింది.

తల్లి అలా లోపలికి వెళ్లగానే పెద్దపిల్లాడు గజ గజ లాడిపోయాడు. వాడికళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి....

అప్పుడే ఆ తల్లి, 'అన్నం ఏదిరా....?' అంది.

నేరం చేసినవాడిలా ఆ పెద్ద కుర్రాడు మాటా మంతీ లేకుండా నిలబడిపోయాడు. వాడి బుగ్గలమీద కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి. చిన్నవాడు ఏదో చెప్పాలని పెదవి కదిపి, అన్నవైపు చూసి బెదురు బెదురుగా నిలబడిపోయాడు.

గైరమ్మ తిరిగి 'ఏమైందిరా అన్నం....కుక్కలకు పెట్టేశారేటి. .....'అంది.

పెద్దవాడు మెల్లగా నోరువిప్పి, 'లేదమ్మా....మరేమో.... ఆ అబ్బెవడో ఆకలంటూ వచ్చాడమ్మా. కొంచెం అన్నం పెట్టాను. మరేమో గబగబా తినేసి, ఇంకా ఆకలౌతుంది కొంచెం అన్నం పెట్టవూ అన్నాడు. చాలా ఆకలిగా ఉన్నాడమ్మా, ఎన్నో రోజులయిందంట తిని... రోజూ తింటున్నాంగా అమ్మా మనం అన్నం...! ఈ ఒక్కరోజు మానేద్దామే.... ఆ అబ్బిని సూత్తే ఏడుపొచ్చిందే!'

గైరమ్మ కొడుకును కౌగిలించుకుంది. కంటికి మింటికి ఏకధారగా ఏడ్చింది. 'ఇంత మెత్తనోడివి ఎలా బతుకుతావురా.... జొన్నపొత్తులు కాల్చి ఇత్తాను రండి....తిందురుగాని.....' అని వాళ్లను మరింత దగ్గరకు చేర్చుకుంది.

మెల్లగా, 'మనం పేదోళ్లం బాబూ....మనకిలేదు. అడుక్కునే వాళ్ల కెక్కడ పెట్టగలం. మీ అయ్యవుంటే రోజూ మూడు నాలుగు తెచ్చి పడేసేవాడు. ఇప్పుడెక్కడ నుంచి వత్తాదిరా డబ్బు....'

పెద్దవాడు తల్లి కాళ్ళ దగ్గర కూర్చొని ఆలోచించి, 'అమ్మా నేను ఐస్‌ఫ్రూట్‌లు అమ్ముతానే, అవి అమ్మితే బోలెడు డబ్బొత్తాదమ్మా...'

ఆ తల్లి వాడ్ని గుండెలకు హత్తుకుంది. ఆమె కడుపునెవ్వరో తరిగినట్లయింది. ఆమె కంటి ముందు నడి వేసవిలో జోళ్ళు లేని పసి కుర్రాడు, దాహం వేస్తున్నా, ఆ ఐస్‌ఫ్రూట్లు ముట్టుకోకుండా వీధుల్లో తిరిగి తిరిగి వడదెబ్బ తగిలి పడిపోయినట్లు ఏదో భయంకరమైన దృశ్యం కదిలిపోయింది. గైరమ్మ కెవ్వున అరిచి కొడుకు తలను తన తలకు చేర్చి వల వల ఏడ్చింది.

ఆమె మనోనేత్రాన, ఏవేవో నీడలు పెరిగిపోయాయి. జోళ్లకు పాలిష్ వేసే దిక్కు లేని కుర్రాళ్లు, ఆమె కంటి ముందు చిదిగిపోయిన గుండెలతో నిలిచారు. హోటళ్ళలో కప్పులు కడుగుతూ టేబులు తుడిచే పిల్లలు, ఆ తుడుపు గుడ్డకన్నా హీనంగా నీళ్ళోడుతూ వేదనగా కనిపించారు. కొలిమిదగ్గర తిత్తి ఊదుతూ ఆ వేడికి తట్టుకోలేని పసిపిల్లలు, కాలిపోతూ వంకరలు తిరిగిపోతున్న ఇనుపకడ్డీలవలె ఆమె పాదాల ముందు రాలిపోయారు. గైరమ్మ విహ్వలంగా అరచింది.

'వద్దు నాయనా వద్దు... నువ్వేమీ చెయ్యొద్దు. నువ్వు బాగా చదువుకోబాబూ... మిమ్మల్ని నేను ఎలాగో కష్టపడి చదివిత్తాను' అంది.

అప్పుడే శేషగిరి ఆ గదిముందు నిలబడి గైరమ్మను పిలిచాడు.

గయిరమ్మ ఉలిక్కిపడింది. 'రండి బాబూ రండి... సూడండి బాబూ... ఈ పిల్లల్ని... ఈళ్ళ సెలాసాకేది బాబూ...'

'నీకేం భయం లేదు గయిరమ్మా... నువ్వు ధైర్యంగా ఉండు. పొద్దుట నువ్వు మాట్లాడిన విధం చూసి నాకు చాలా ఆశ్చర్యమేసింది. తెలివి ఒకరి సొమ్ము కాదు. నీ పిల్లల్ని నువ్వు పెంచుకోవడానికి నీకు తోచిన మంచిపని చేస్తున్నావు. ధర్మం నీ తరపున పూర్తిగా ఉంది. ఇంతకన్నా నీకేమి కావాలి...'

'ఏటో బాబూ... నాకు భయంగా ఉంది. ఆళ్ళన్నట్టు అంట్లు తోముతాననుకో బాబు, ఏటొత్తాది... పదొచ్చె... పరకొచ్చె... ఈ పిల్లల్ని నాకు సదివించాలని ఉంది బాబు. ఈళ్లసలే సత్తెగాలపోళ్లు, ఎలాగ బతుకుతారో ఏమో'

'నిక్షేపంలా బ్రతుకుతారు. ఆ బెంగ పెట్టుకోకు. నువ్వు మాత్రం ఎవరు బెదిరించినా హడలిపోకుండా ధైర్యంగా నిలబడు. అంతే మిగిలిందంతా నేను చేస్తాను. నీకు లైసెన్సు రేపే ఇచ్చే ఏర్పాటు చేస్తాను. నువ్వు రేపొద్దుటే ఆ ఆఫీసుకురా...'

'శానా ఛిక్కులున్నా యనుకుంటాను భాబూ'

'ఏమీ లేవు, అవన్నీ చూసేవాణ్ణి నేనున్నాను'

'ఏటో బాబూ నా గుండె దడ దడ లాడుతంది. ఈ రిక్షా వాళ్ళను చూత్తే అదేటో భయంగా ఉంది.'

'వాళ్లు నిన్నేమీ చేయలేరు గయిరమ్మా... అనవసరంగా వాళ్లు బెదిరి పోతూవుంటే ఎవరేం చేస్తారు. ఈ రిక్షాలు పుట్టకముందు నా చిన్నప్పుడు గుర్రపు బళ్ళుండేవి. ఇప్పుడవన్నీ ఏ మయ్యాయి? ఆ రోజుల్లో వాళ్లు ఈ రిక్షావాళ్ళను రోడ్డు మీద కాలు పెట్టనివ్వకుండా చేస్తే వీళ్ళిపుడెక్కడ ఉండేవారు? బస్సు పుట్టి బళ్ళ వాళ్ళ కడుపు కొట్టిందని నీవు వినే ఉంటావు. ఇదే నిజానికి యుద్ధం అంటే. మనిషి మార్పుతో యుద్ధం చేస్తున్నాడు. ఎవరు ఆ మార్పు ననుసరించి నడచుక పోతున్నారో వారు బాగుపడుతున్నారు. లేనివారు ఆ మార్పుల ఇరుసులో పడి నలిగిపోతున్నారు. ఇప్పుడు కూడ కొంతమంది జట్కా బళ్ళవాళ్ళు కనిపిస్తారు. వాళ్ళకు కూడు ఉండదు. వాళ్ళ గుర్రాలకు దానా ఉండదు. ఏ క్షణాన్నైనా ఏ చక్రానికా చక్రం ఊడిపోతుందేమో అన్నట్లుగా ఉంటుంది. ఆ బండి. అయినా దాన్నే పట్టుకొని

వేలాడుతారు. వారిని చూస్తే జాలేస్తుంది. కాని వాళ్ళు మారలేరు. రేప్పొద్దున్న ఈ రిక్షావాళ్ళు కూడా అలాగే ఇరుకున పడతారు. కొద్ది రోజుల్లో ఆటో రిక్షాలు వస్తాయి. వీళ్ళకు వాటిని తొక్కడం చాతగాదు. అది నేర్చుకోడానికి అనేక కారణాల వల్ల కుదరదు. దీనితో వీళ్ళ బతుకు బయట పడుతుంది. వీళ్ళంతా నాశనం అవుతారు. ఈ యుద్ధంలో వీళ్ళు హతమారిపోతారు. పూర్వం చాలా మంది రాజులు కొత్త ఆయుధాల గురించి తెలుసుకోడానికి ప్రయత్నించక పోవడం వల్ల రాజ్యాలు పోగొట్టుకున్నారు. ఇందుకనే ఈ పరుగెత్తే కాలంలో క్షణం నిలకడలేని ఈ మార్పుల ఆర్భాటంలో మనిషి చాతకానివాడుగా నిలబడిపోగూడదు. ఏ పనికైనా సిద్ధంగా ఉండాలి. ఈ కార్లు నడిపే డ్రైవర్లకు కూడా ఈ ముప్పు వస్తుంది. విమానాలు వాటి స్థానంలో ఆక్రమించడం ఎన్నాళ్ళో పట్టదు. మనిషి మనిషికీ విమానం వస్తుందేమో... ఇందుకనే ప్రభుత్వం దూరదృష్టితో ఎప్పుడూ మెలగాలి. అయిదు సంవత్సరాలే నా బతుకు అనుకుంటే ఆ ప్రభుత్వం తాలూకు ప్రజల జీవితం అలాగే అడుగంటి పోతుంది. మంత్రులందరూ అయిదు సంవత్సరాలే ఆ పదవుల్లో ఉన్నా, వారి దృష్టి ఎప్పుడూ అయిదు వేల సంవత్సరాల ముందుకు ప్రసరించాలి. ఇప్పుడు అన్ని రకాల పొలం పనులు చేయడానికీ మెషీన్లే ముందుకొస్తున్నాయి. దీనితో వ్యవసాయ కూలీలు పనిలేని వాళ్ళుగా తయారవుతారు. వీళ్ళందరికీ జీవితాన్ని ఇవ్వడానికి తద్వారా దేశం బ్రతుకు పెంచడానికి ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించాలి. ఈ ప్రజ కూడా ఈ విషయంలో కృషి సల్పడానికి ముందడుగు వేయాలి. ఈ పని తప్ప నా కింకొకటి చాతకాదు, ఈ పని తప్ప నేను మరొకటి చేయను అంటే వీలుపడదు. ఇంతకన్నా మరొక రకం మనుషులుంటారు. మేము ఏ పనీ చేయం అంటారు వాళ్ళు. ఇక ముందు దేశం, పని చేసే వాళ్ళనే గౌరవిస్తుంది కాని, పని చెయ్యని వాళ్ళను గౌరవించదు. నీ బతుకు నువ్వు బతకడానికి నువ్వు ధైర్యంగా ముందుకొచ్చావు. ఒళ్ళు దాచుకొనే తత్వం నీలో లేదు. ఇందుకు నిన్ను నిజంగా ఎంతో అభినందించాలి. కొత్తగా రిక్షాలు తొక్కే వాళ్ళను ఈ రిక్షాల వాళ్ళు అడ్డు పెడ్డటం లేదు కదా.. అలాగే నిన్నూ ఎందుకు చూడగూడదూ!... అంత పిరికితనం ఏమిటి? వాళ్ళ పిరికితనానికి నువ్వు బలికావడమేమిటి? ఇదంతా మూర్ఖుల లక్షణం. అలాంటి తెలివి తక్కువ వాళ్ళకు మనం ఎప్పుడూ తల ఒగ్గకూడదు.'

'అయితే బాబూ... తెలియక అడుగుతాను, మోటారు రిక్షాలొస్తే ఈ రిక్షా వాళ్ళంతా ఎలా బతుకుతారు?'

'ఇది నిజంగా ఆలోచించవలసిన విషయం. కాని ఈ రిక్షా వాళ్ళకు అలాంటి ఆలోచనేలేదు. పోనీ వాళ్ళకంటే ఏమీ తెలియదనుకో.. వాళ్ళ సంఘం నాయకులు ఆ చందా డబ్బుల గురించే ఆలోచిస్తారు కాని, ఇలాంటి విషయాల గురించి ఏమీ ఆలోచించరు. కనీసం వాళ్ళ రిక్షావాళ్ల కష్ట సుఖాలను వాళ్ళు నిజంగా చూసే వాళ్ళయితే సంఘం డబ్బుతో ఈ పాటికి ఓ ఆటో రిక్షాను కొని వీళ్ళందరికీ దాన్ని ఎలా నడపాలో నేర్పి ఉండవలసింది'.

'నేర్పితే మాత్రం ఉపయోగమేమిటి బాబూ... ఈళ్ళందరికీ రిక్షాలు ఎక్కడ నుంచి వత్తాయి. వత్తే మాత్రం అప్పుడాళ్ళందరికీ పనులుండొద్దా...'

'నిజంగా నువ్వు తెలివైన దానవు గైరమ్మా... మంచి ప్రశ్న వేశావు. నేను ఈ విషయం ముందు చెప్పాను. ప్రభుత్వం కొత్త కొత్త పరిశ్రమలు స్థాపించి, ఇలాంటి వాళ్ళందరకూ వాటిల్లో పనులు కల్పించి, ఆదుకోవాలని. చూడు నేను నీకు కొద్ది రోజుల్లోనే చదువు నేర్పించి... నీలో ఎన్నో మార్పులు ప్రవేశ పెట్టకపోతే...'

'ఎందుకు బాబూ అవన్నీ... ఈ బతుకిలా ఎల్లిపోతే చాలు.'

'అదిగో మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతున్నావు. ఇలా అనే దానవు అంట్లు తోముకొనే బతకగూడదూ! కాని నీకా పని అంటే ఇష్టమే లేదు. నీ శక్తిని నీవు గుర్తించావు. ఎక్కువ కష్టపడటంవల్ల ఎక్కువ సుఖమున్నదని గ్రహించావు. సోమరితనమంటే నీకు గిట్టదు. ఓ గంట గంటన్నరలో అయిపోయే ఇంటిపని కోసం మిగిలిన గంటలనన్నిటినీ మురుగు కాల్వలో పోయడం నీకు సుతరామూ ఇష్టం లేదు. ఇలాంటి నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. దేశంలో ఎక్కడైతే సగం శక్తి నిర్జీవమైపోతోందో, అక్కడ నుంచి నువ్వు ఆశాజ్యోతిగా వెలుగుతున్నావు. నీవు ధైర్యానికి, భవిష్యత్తుకు చిహ్నానివి! నీలాంటి వీరవనితల వల్లనే ఎప్పటికైనా ఈ దేశానికి ముక్తి! ఈ సంఘంలో పేరుకొని పోయిన అనుమానాల పెంటకుప్పల్ని, జుగుప్సాకరమైన కుళ్ళు కాల్వల వంటి వూహల్ని, నువ్వు పెళ్ళగించిపారేసి ఈ మనుషుల మేధస్సులో ఉత్తమ ప్రమాణాలను తీర్చి దిద్దుతావు. ఒక ఆడది మగవాడితో మాట్లాడితేనే చాలు సహించలేని ఈ దేశపు నెత్తురులో సరియైన దృష్టిని వినూత్నంగా సృష్టిస్తావు. నిజమమ్మా నిజం... నీవు మహోన్నతంగా జ్వలించే విప్లవ కాంతివి! నీవు నా వూహకు ఏ విధంగానూ అందని చైతన్య స్వరూపిణివి...! నువ్వు యుగ యుగాల మునుముందు అనంతంగా పయనించే ఎప్పటికీ అంతం కాని మార్గానికి మార్గదర్శినివి!"

'ఏటండీ ప్లీడరుగారు... ఏటి బాబూ ఆ మాటలు... మీరు దేవుడులా అనుతున్నారు.

మీ కళ్లల్లో ఆ కాంతి ఏటి బాబూ...' అంటూ గయిరమ్మ అతనివైపే చూస్తూ విస్తుపోయింది. ఆమె ప్రక్క నిలచిన పెద్ద కుర్రాడు దీక్షగా అతని వైపే చూశాడు. చిన్న కుర్రాడు తల్లి చెంగు పుచ్చుకొని, భయం భయంగా శేషగిరివైపు తొంగి తొంగి చూస్తున్నాడు.

శేషగిరి ఒక్కసారి మనుషుల్లోకి వచ్చి, 'ఏమిటన్నాను... నేనేమిటన్నాను...' అని స్వగతంగా అనుకున్నాడు. 'ఏమిటో పిచ్చిగా వాగేశాను. వస్తాను గైరమ్మా... రేపు... మరచిపోకు...' అన్నాడు. గయిరమ్మ అతను పోయిన దిక్కువైపు అలాగే చూస్తూ ఉండిపోయింది.

# 4

రాత్రి పిల్లలిద్దరూ నిద్రపోయారు. బయట వెన్నెల భవిష్యత్తులా ఉంది. గుమ్మం ముందు కూర్చుని గయిరమ్మ ఏమిటో ఆలోచిస్తోంది. ఏవేవో తెగని సమస్యలు ఆమె నరనరాన్నీ నరకుతున్నాయి. మధ్య మధ్య ప్లీడరు గుర్తుకొచ్చి తెగిన ఆమె ఆశలకు జీవం పోస్తూ పక్కకు తప్పుకుంటున్నాడు.

అప్పుడే గుసగుసలుగా కొన్ని కంఠాలు దగ్గర పడుతూన్నట్లు అలికిడయింది. ఘాటైన చుట్టకంపు ఆమెను ఇబ్బంది పెట్టి పక్కకు తప్పుకుంటోంది. పైమీద తువాలు ఎవరో టప్‌మని దులిపి, ఖాండ్రించి ఉమ్మారు. ఇద్దరు ముగ్గురు సకిలించారు. అప్పుడే చిన్న కలకలం నోరు తెరచుకొని ఆవులించి, బద్ధకంగా ఒళ్లు విరుస్తూ ఆమె ముందు మబ్బులా నిలిచింది.

'ఇంకా నిద్రపోలేదా గయిరమ్మా...' అన్నాడో రిక్షా అబ్బాయి.

'మన సంఘం నాయుడు గారొచ్చారు గయిరమ్మా...' మరొకడు గయిరమ్మ పక్కకే చేరాడు.

గయిరమ్మ గుండె దడ దడ లాడింది.

' ఏటి బాబూ ఇలా గొచ్చినారు' అంది.

'అదే గయిరమ్మా...' అనిసంఘం నాయుడు ఒక సారి కంఠం సరిచేసుకున్నాడు. ఒక విచిత్రమైన ధ్వని చేశాడు.

ఆ నేల మీదనే అంతా కూర్చున్నారు. గయిరమ్మ నిలబడి ఉండిపోయింది.

'చూడు గయిరమ్మా... నిన్ను చూత్తే నాకు చాల జాలేత్తోంది. ఆడేమో అగస్మాత్తుగా నీకేదారీ చూపకుండా పోనాడు. పాపం పిల్లలు, ఎలాగ బతుకుతావు...'

గైరమ్మ మాటాడలేదు.

'చూడు గయిరమ్మా... ఒక్కమాట సెప్తావింటావూ... మా ఈధిలో ఓ అమ్మాయుంది. ఆ పిల్లకు పుగాకు కంపెనీలో పని. రోజు రెండున్నర పైనే తెచ్చుకుంటాది. పని కాడకెల్లకుండానే, కంపెనీ వోళ్లు గుర్తుకోసం ఇత్తా ఉంటారే ఆ బిళ్ల అమ్మేత్తూ ఉంటాది. అక్కడి టైముకీపర్ని బుట్టలో ఏసుకుందిలే. అంచాత ఆడు సూసీ సూడనట్టూరుకుంటాడు. మరి ఆ బిళ్ల కొనుక్కున్న అమ్మి రూపాయి తీసుకొని మిగిలింది ఆ పిల్లకిచ్చేత్తూ ఉంటాది. పొలం కవులు కిత్తారే, అలాగే అనుకో. ముందు, ముందు ఉజ్జోగాలు కూడ అలాగే కవులు కిచ్చే తారంటలే.' ఈ మాట అని నాయుడు హుందాగా నవ్వి చుట్టూ ఉన్న వాళ్ళు ఎంత మంది నవ్విందీ పరీక్షించుకొని 'చూడు గయిరమ్మా.. పొగాకు పని శానాసులువు. నువ్వు ఊ అంటే ఆ పిల్ల నీకే ఆ బిళ్ల ఇచ్చే ఇదానం చెప్తా. కడుపులో సల్ల కదలకుండా పనిచేసుకు పోవొచ్చు. ఏటంటావు' అన్నాడు.

గయిరమ్మ మెల్లగా ' ఒక్క రూపాయి నాకేటి సరిపోతాది బాబూ... అయినా కట్టపడే వాళ్లకే పొలాలు కాని, కవులు కిచ్చే వాళ్లకు గింజలివ్వకూడదని - అదేటో ఆ మద్దె సెప్పి నారు కాదా... ఆ తప్పే ఈ బుల్లి సేత్తే తప్పు కాదా బాబూ. ఆ ఆడది కట్టపడటమేటి... అదేమో కూసోని తిండమేటి... ఏటో నాకేటీ తెలీకండా ఉంది'.

'అబ్బో... మంచి సెబుతావుంటే... సెడ్డ ఎధురవుతోందే... అయితే రిక్షా తొక్కడం మాననంటావ్...'

'ఏం బాబూ తప్పా...'

'తప్పా... తప్పున్నరా... ఇంకా సిగ్గునేకుండా మాటాడుతున్నావు. ఆడదానివై పుట్టి మగోళ్లను రిక్షా లెక్కించుకొని తిరుగుతావా...'

'నాకెందుకు సిగ్గు, మీ కుండాలిగాని, మగోళ్లయి ఉండి ఆడోళ్లని రిక్షా లెక్కించుకొని తొక్కుతున్నారు. మీ కుండాలా సిగ్గు నాకా? పౌరుషమేలేదు మీకు...'

'ఆ ఏమిటన్నావ్... నోటి కొచ్చినట్టు వాగుతున్నావ్...'

'నా యింటి ముందుకొచ్చి మీరు వాగుతున్నారా నేనా...?'

'అబ్బో ఇంత దూరం వచ్చిందా యవ్వారం. నాను సెవుతున్నాను. ఇనుకో గయిరమ్మ... నువ్వు రిక్సా తొక్కావా... మర్నాడే మరి పత్తా ఉండవు. ఎందుకొచ్చిన

గొడవ నీకిదంతా... సుబ్బరంగా ఈ రిక్సా నేను సెప్పినోడికి బాడుగకియ్యి. పుగాకు పని చేసుకో. సక్కగా ఎల్లిపోద్ది సంసారం.'

'ఒకడికి నాను బాడుగ కియ్యడమేటి... ఆడికట్టం నేను తినడమేటి. నాకిట్టం నేదు బాబూ, నా కట్టమేదో నేనే పతడాను.'

'రాజాబుద్ది నీది గయిరమ్మా... పెజలంతా ఇలాగే ఉంటే కట్టాలే ఉండకపోయేవి. ఒకటి సెప్తాను ఇను. నువ్వు ఇవాళ తొక్కుతావు. రేపు.. ఇంకొకర్తి తొక్కుతాది. ఎల్లుండి ఇంకో వందమంది బయలుదేరుతారు. అప్పుడేమవుద్ది? నువ్వు మంచి మడిసివే. ఆళ్లు నీలాగే మంచోళ్లవుతారా. అప్పుడు మా బతుకేమవుద్ది. నువ్వే ఆలోచించి సెప్పు, మగోళ్లందరూ ఆడోళ్ల రిక్షాలంటేనే ఎగబాకుతారు. ఆల గుణమే అంత గదా... ఏటంటావు?'

ఈ మాటలతో గయిరమ్మ ఇహ లొంగిపోతుందనుకున్నారంతా, కాని -

'ఎప్పుడో ఏటో జరుగుతాదని ఇప్పుడు నన్ను సావమంటారా... నాకిన్ని పనులు సూపించినోరు - మీరే, పనులు సూసుకోనేరూ... పని సెయ్యాలిగాని పనులకేటి కరువు'

'అబ్బో నువ్వు శానా సదువులుసదివావే... సదువుకున్నోళ్లను సూడు, ఉజ్జోగాలు నేక ఎలా సచ్చిపోతన్నారో,'

'అయితే నాకు బతకడానికి ఈలుండి కూడా సచ్చిపోమంటారా, ఇదెక్కడినాయం. అయినా మీరు సిన్నప్పటి నుంచి ఈ పని సేసేత్తున్నారా. పుత్తెకట్టినట్టు మాటాడుతారేం ...పెట్రోలు రిక్సాలొత్తే అప్పుడేటి సేత్తారు...'

' పెట్రోలు రిక్సాలొచ్చినప్పటి మాట కదా'

'అలాగే ఆడోళ్లందరూ రిక్సాలు తొక్కినప్పటి మాట గదా అనుకోగూడదా... ఎందుకిలా ఉత్తిపున్నేనికి భయపడిపోతారు. ఈ పని తప్ప ఇంకో పని సెయ్యలేం అనుకుంటే ఎప్పుడూ భయంగానే ఉంటాది. ఏ పనేనా సెయ్యగలం అన్న గుండె నిబ్బరం ఉంటే భయమే ఉండదు..'

'నీ మాట నాకేమీ నచ్చలేదు గయిరమ్మా... నువ్వు సంఘానికి సీడ పురుగివి. నీ మూలాన ఆడోళ్ళందరూ సెడిపోతారు. రేప్పొద్దుట మాపెల్లాలు మా మాట ఇనరు. ఆళ్లూ రిక్షాలు తొక్కుతాం మీ లెక్కేటి అంటారు'

'ఆళ్లూ తొక్కితే నయమేగా... ఏడినీళ్ళకు సన్నీళ్ళు తోడై నట్టుంటాది...'

ఎంత సెప్పినా నీ బుర్రకెక్కకుండా ఉందే... సరే పదండిరా ఎలా తొక్కుతాదో

సూద్దాం, దీనికి డబ్బు పిచ్చ మాబాగా పట్టింది. కడమాటగా సెపుతున్నా... నామాటిను గయిరమ్మా...'

దీనితో రిక్షా వాళ్ళందరూ తలో మాట నోటికొచ్చినట్టల్లా అనడం మొదలు పెట్టారు. 'ఏం సూసుకొని దీనికి పొగరు...' అని ఒకడు 'నాలుగు తగలనియ్యండెహే...' అని ఒకడు, 'కళ్ళు మూసుకపోయి ఏడుత్తంది...' అని మరొకడు ఏమేమో కూశారు.

గయిరమ్మ తీక్షణంగా వాళ్ళ వైపు చూసింది. వాళ్ళ బాధేకాని తన సంగతి వాళ్ళకేమీ పట్టదేం అనుకుంది. ఇంతలో ఒకడు, 'మొహమ్మీద ఉమ్మండిరా... రౌడీ ముండ ఎలా నిలబడిందో' అన్నాడు. 'ఏడిసింది వూరుకోండిరా... ఎవడ్నైనా సూడమంటావేటే. పెళ్ళాడితే ఈకట్టమంతా ఆడే పడతాడు. ఏటి...' అంటూ గుండెల్ని రక్కుతూన్నట్టు నవ్వాడు. అంతా గొల్లుమన్నారు. ఇంతలో ఇంకొకడు, 'కల్లు అమ్మగూడదూ... బోలెడు నాభం. నువ్వుకన్ను గీటితే కనకాభిషేకమే...'

ఎవరేమన్నా గయిరమ్మ మాట్లాడలేదు. ఆమె కళ్ల వెంట అలాగే కారుతున్న నీరు భూమిలోకి ఇంకిపోయింది.

మూక మెల్లిగా ఇంటిదారి పట్టింది. కాని వారిలో ఆ భయం విజృంభించసాగింది. ఆ రాత్రికి రాత్రే సంఘం సెక్రటరీ దగ్గరకు వెళ్ళారు. అతను బద్ధకంగా లేస్తూ 'ఏమిటి అంత అర్ధరాత్రి పనిగట్టుక వచ్చారు...?' అన్నాడు.

నాయుడు అంతా చెప్పాడు.

శక్రటరీకి నవ్వు వచ్చింది.

'పిచ్చోళ్ళలా ఉన్నారే... తిన్నగా ఇళ్ళకు పోయి పడుకోండి...' అన్నాడు.

కాని, వాళ్ళు కదల్లేదు.

'ఇదిగోనయ్యోయ్... మేం పిచ్చోళ్ళమో.. మంచోళ్ళమో అదంతా ఇప్పుడెందుకు, ఆ గయిరమ్మకు లైసెన్సొచ్చిందా ఇక మీపార్టీలో వుండం. ఆ కాంగ్రెసోళ్ళయితే ఆలదే ప్రభుత్వం కాబట్టి దానికి లైసెన్సు ఇవ్వకుండా సేసేస్తారు. రేప్పొద్దుటొచ్చి కలుస్తాం బాగా ఆలోచించుకో..' అన్నారు.

సెక్రటరీకి మతి పోయింది. ఇంత అకస్మాత్తుగా ఆ స్వల్ప కారణానికి వీళ్ళిలా మారిపోడానికి కారణం అతని వూహకందలేదు. ఇందులో ఏదో కుట్ర వుందనుకున్నాడు. వీళ్లంతా ఎదురు తిరిగితే తన పార్టీకి సగం బలం తగ్గినట్లే అని దిగులు పడిపోయాడు. అయినా కాంగ్రెసు వాళ్ళు మాత్రం ధర్మానికి కట్టుబడి వుండకుండా ఎట్లా వుండగలరని మనసులో సరిపెట్టుకున్నాడు. 'న్యాయంగా బతకటానికి అందరికీ హక్కుంది. ఆమె

చేసేదాంట్లో తప్పేముంది, వీళ్ళ మూర్ఖపు పట్టుదల కాని', అని అనుకుంటూ నిద్రపోబోయాడు. కాని నిద్రరాదే. ఆలోచించే కొద్దీ ఇదేదో తేలనిసమస్యగా అతని మనసులో స్థిరపడటం మొదలు పెట్టింది. ఈ పరిస్థితిని, కాంగ్రెసు వాళ్ళు తమ కనుకూలంగా ఉపయోగించుకొని పార్టీలో ముసలం పెడితేనో... ఇంకేముంది? ఎవరూ అడుగు పెట్టడానికి వీలులేని ఈ కంచుకోట ఆటంబాంబు పేలినట్లు పేలిపోతుంది. ఇప్పుడే జాగ్రత్త పడాలి. యాదవకులంలో ముసలంలా ఏదో జరుగబోతోంది అనుకున్నాడు.

ఆ మరునాడు ప్లీడరు శేషగిరి అతి నేర్పుగా మాట్లాడి లైసెన్సు ఇనస్పెక్టర్ని తన గుప్పిటలో పెట్టుకొని, గయిరమ్మకు లైసెన్సు ఇప్పించాడు.

ఈ మాట ఆ నోట ఆనోట ఊరంతా పాకింది. మరునాడు కొన్ని పత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. ఇది చూసి ఓ కవి కుమారుడు మూడు గేయాలు వ్రాశాడు. ఒక వృద్ధకవి, కలిమాయను గురించి పంచరత్నాలు పకడ్‌బందుగా అల్లాడు. ప్లీడరుగారి భార్య లీల ఒక వ్యాసం వ్రాసింది. ఏ రోజు కారోజు వూళ్ళోని సమాచారం పత్రిక ఈ విశేషానికి సంబంధించిన విషయాలను పూర్తిగా ప్రచురించడం మొదలు పెట్టింది. ప్రజల్లో విపరీత సంచలనం కలిగింది. ఒకొక్కరు ఒకొక్కలా చెప్పుకోవడం మొదలు పెట్టారు. కొంత మంది శరీరం ఆ మాట వినగానే పులకించింది. కొంత మంది మనసు 'రామరామ' అని ముక్కు మీద వేలేసుకుంది.

కార్లు కూడా ఇక ముందు ఈ ముష్టి ఆడవాళ్ళే నడువుతారేమో అనుకున్నారు. చాలా మంది కార్లు గల ధనపురాణీలు ఇహ భర్తలను అదుపులో పెట్టడం మరీకష్టం... ఇంట్లో దాసీ పిల్లలతో సరసాలు సాగించినప్పుడే పట్టుకోడం కష్టమైపోతూంటే బయట ఈ ఆడ డ్రైవర్లతో వాళ్ళు ఎక్కడెక్కడ ఎలా తిరుగుతారో ఎలా పసిగట్టగలం అంటూ బెంగపడిపోయారు.

'ఇలా ఆడవాళ్ళు రిక్షాలు లాగడం వల్ల వాళ్ళ గర్భకోశం దెబ్బతిని ఇక వాళ్ళకు పిల్లలు ఛస్తే పుట్టరు, దీనితో దేశంలో కూలీల కోసం వాన్‌టెడ్ కాలమ్స్, ప్రకటనలు పెచ్చుపెరిగి పోతాయి. దాసీ పిల్లలూ, పిల్లల్ని ఆడించే అబ్బాయిలూ, అమ్మాయిలూ, గంపలు మోసేవాళ్ళూ కంటికి కనిపించకుండా పోతారు. ఇక మనమే అన్నింటికీ చావాలి' అంటూ ఓ దూరదృష్టి బూర్జువా ఏడ్చాడు.

ఇహ గయిరమ్మ పాపం రెండు రోజులు రిక్షా మీద తిరిగింది. ఎవరూ రిక్షా ఎక్కలేదు. వెలివేసినట్లు ఆమెను చూస్తున్నారు. మగవాళ్ళ కెందుకనో ఆ రిక్షా

ఎక్కడానికి భయంగా ఉంది. ఆడవాళ్ళు గయిరమ్మను అసహ్యించుకుంటున్నారు. కొందరు ఆమె ముందూ వెనుకా నవ్వుతున్నారు.

రిక్షావాళ్ళ గుండె గయిరమ్మను చూసినప్పుడల్లా భగభగ మండిపోతోంది. కొంత మంది వయసు మళ్ళిన రసికులు ఆ రిక్షాలో ఎక్కడానికి ప్రయత్నించారు. తిరిగి ఎందుకనో తటపటాయించి ఇంకో రెండు రోజులు చూదాం అనుకున్నారు. గయిరమ్మ గుండె నీటి బుగ్గ అయిపోయింది. ఆమెకు ఏమి చేయడానికీ తోచలేదు. తనను చూచి అంతా ఎందుకలా భయపడిపోతున్నారు అని ఏడ్చింది. తల పగలకొట్టు కోవాలనుకుంది. ఉత్తచేతులతో ఇంటికి వెళ్లడానికి ఆమె గుండె కుళ్ళి కుళ్ళి ఏడ్చి నీరసించి పోయింది. కాని ఏమి చేస్తుంది?

ఆ మరునాడు డి.ఎస్.పి దగ్గర నుంచి ఏమి ఆర్డర్లు వచ్చాయో కాని, గయిరమ్మను పోలీసులు అరెస్టు చేశారు. న్యూసెన్సు కేసు పెట్టారు. శేషగిరి ఆమెను జామీను మీద విడుదల చేయించి, నీకేం భయంలేదు అన్నాడు. గయిరమ్మ ఆకాశంవైపు వెర్రిగా చూసింది. ఆమె మనసు ఏమిటో అనంతంగా పరిభ్రమిస్తోంది. ఆమె మాట్లాడకుండ ఇంటికి వెళ్ళింది. పిల్లల్ని అలాగే చూసింది. తల్లి కళ్ళలోకి పిల్లలు చూస్తూ ఎందుకో భయపడిపోయారు. గయిరమ్మ కళ్ళలో నీరు ఉబకలేదు. పిల్లలిద్దరూ బావురుమన్నారు.

గయిరమ్మను అరెస్టు చేశారని, జామీను మీద విడుదల చేశారని శేషగిరి కోర్టులో వాదిస్తాడని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఈ దెబ్బతో పత్రికల గిరాకీ పెరిగింది. మేజస్ట్రేట్ కోర్టులో, వాద ప్రతివాదనలు, కొల్లేటి చాంతాడులా పెరిగిపోయాయి. వేడి వేడి పకోడీల్లాంటి ఆ వాదనలు అందరికీ ఎంతో ఎంతో ఇష్టమయ్యాయి. క్రాస్ ఎగ్జామినేషన్‌లో గయిరమ్మ సమాధానాలు బ్రిటానియా బిస్కెట్లలా ఉన్నాయని కొందరంటే, కొందరు రాకెట్లలోంచి పైకి జ్వలించే అగ్నిజ్వాలల్లా ఉన్నాయన్నారు. ఇహ ఆమె ఎట్లా ఆకర్షించిందీ, ట్రాఫిక్ ఏ విధంగా నిలిచిపోడానికి కారణమైందీ సాక్షులు ఏకరువు పెట్టిన విశేషాలు, ఓ పెద్ద ప్రణయ సామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రక గాథలా తయారై, ఓ విద్యార్థికి పి.హెచ్.డి డిగ్రీ సాధించి ఇవ్వడానికి వీలైనంత పటుత్వంతో పేపర్లలో నిలిచిపోయాయి.

ఈ హడావుడి అంతా చూసే సరికి రిక్షావాళ్ళ గుండెలు మరింత పీచు పీచుమన్నాయి. ఈ గొడవ ఇంతటితో వదిలేది కాదని వాళ్ళు హడలిపోయారు. కాంగ్రెసు పార్టీలో చేరిపోతే న్యాయం, తమ తరపున చెప్పించుకోవచ్చని ఆలోచించారు. ఆ పార్టీ నాయకుల్ని కలుసుకున్నారు.

ఈ అదను దాటితే వీళ్ళను ఆకట్టుకోవడం కష్టమని పట్టణ కాంగ్రెస్‌నాయకులు గట్టిగా భావించారు. 'అలాగే చూద్దాం.... ముందు మీరు మాలో చేరండి' అన్నారు. కాని ఒక ప్రాణి కోరుతూన్న ధర్మాన్ని, న్యాయాన్ని ఏ సాకుతో కాదనాలో తోచక తలలు పగులగొట్టుకున్నారు. పార్టీలను పగలగొట్టి పడగొట్టాలి కాని, తలలు పగులగొట్టుకుంటే లాభమేముందని, ఈ సంగతి పైవారికి తెలియబరిచి, వారి ఆదేశాల కోసం జపం చేస్తూ కూర్చున్నారు. ఈ సంగతి చల్లగా కాంగ్రెసు ప్రెసిడెంట్‌గారి దివ్యసముఖానికి తరలి వారి అనుజ్ఞ కోసం చేతులు జోడించుకొని నిలబడి పోయింది.

కమ్యూనిస్టు పార్టీ వారు ఈ విషయం తమ పెద్దలకు మనవి చేసుకున్నారు. న్యాయం అంటూ కూర్చుంటే పార్టీ ముక్క చెక్కలైపోయేట్లుంది. ఇలాంటి సంకట పరిస్థితులలో పార్టీ కోసం ఈ తప్పు చేసినా ఫరవాలేదు. ఆమె రిక్షా తొక్కడం న్యాయవిరుద్ధం అనమన్నారు.

ఈ గొడవ ఇలా రెండు పార్టీల మధ్య విచిత్రంగా తలదూర్చి అందరి తలలనూ ఖరాబుచేసి పారేసింది.

ఇదే అదను అనుకొని ఓ నాటకేశ్వరుడు, ఓ నాటకం అల్లిపారేశాడు. ఆ నాటకానికి బోలెడు డబ్బు వచ్చింది. రిక్షా రాణి వేషం వేసిన చిట్టి తల్లికి చింతాకు పతకమొకటి స్వేచ్ఛా సమితివారు అందరి సమక్షాన బహూకరించారు.

ఓ 'కవిమంత్రి' ఈ గాథను కావ్యంగా తీర్చిదిద్ది సొమ్ము చేసుకోవడమే కాకుండా కావలసినన్ని సన్మానాలు చేయించుకున్నాడు.

పాపం కొన్ని మహిళా సంఘాలలో ఈ విషయంమీద వాద ప్రతివాదనలు ప్రజ్వరిల్లి శెక్రటరీలు, ప్రెసిడెంట్లు మారిపోవడం తటస్థించింది.

కొంత మంది రాజకీయ నాయకుల తారలు కూడా తలక్రిందులు కావడానికి వీలుంటుందేమోనని కొంతమంది పాపం ఆశాజీవులు ఎదురు చూడటం మొదలు పెట్టారు.

ఇహ పేపర్ల అమ్మకం సరేసరి. వాటి అమ్మకం అంచనాలకు లెక్క చేయకుండా దాటి పోవడం వల్ల పత్రికాధిపతులు చేతులు రెండూ పైకెత్తి ప్రజల్ని క్షమించమంటూ కోరుతున్నారు. వారి ఈ ఆదరణకు వారి తలలు ఎంతో ఎంతో కృతజ్ఞతాభావంతో వంగి పోతున్నాయని మరీమరీ విన్నవించుకున్నారు. ఇదే సమయంరా చిట్టీ తమ్ముడూ అనుకొని కొంత మంది పేపర్లమ్మే హీరో పిల్లలు ఆ పేపర్లను బ్లాక్ మార్కెట్ చేశారని

దేశమంతటా గగ్గోలయిపోయింది.

శేషగిరి వాదనలతో ససేమీ ఏకీభవించని మేజస్ట్రేటు గయిరమ్మకు ఓ నెల ఖైదుశిక్ష, యాభై రూపాయలు జరిమానా విధించారు.

శేషగిరి గయిరమ్మను బెయిలు మీద విడిపించి ఆమెకు ధైర్యాన్ని నూరిపోసి, జిల్లా మేజస్ట్రేట్ కోర్టులో అప్పీలు పడేశాడు. ఆయన నేరం ఋజువైందని చెప్తూ జరిమానా ఇచ్చుకోవలసిందని, జైలు శిక్ష తగ్గిస్తున్నానని చెప్పారు. అయితే శేషగిరి వదల్లేదు. అతను ముందుకు ప్రవహించే నదిలాంటి వాడు కాబట్టి, గాలి లేని చోటికి గుండెలా కొట్టుకుంటూ పరుగెత్తే గాలిలాంటి వాడు కాబట్టి శ్రమ అనుకోక హైకోర్టులో రివిజన్ పిటీషన్ పడేశాడు.

అంతా హైకోర్టు నుంచి వెలువడే వార్త కోసం ఆ తీర్పుల ముక్తాఫలం కోసం ఎదురు చూస్తున్నారు. ఇది హక్కులకు సంబంధించిన విషయం,గయిరమ్మకే న్యాయం జరగాలి అని ఒకరు. ఇది సంఘానికి సంబంధించిన విషయం, గైరమ్మ సంఘద్రోహి.. ఆమెకు న్యాయం జరగగూడదు, సంఘం పతనం చెందగూడదు అని మరొకరు ఎక్కడ చూసినా ఐక్యరాజ్య సమితిలోని పెద్దమనుషుల్లా దెబ్బలాడు కోవడమే కాని ఏకీభవించడం మాట మరచిపోయారు.

ఇది ఇలా ఉండగా అకస్మాత్తుగా ఓ రోజున,మబ్బు అడ్డుకుండా సూర్యుడు తెల్లగా వెలిగిపోతూన్న ఓ శుభముహూర్తాన హైకోర్టు నుండి అత్యద్భుతమైన ఓ వార్త వెలువడింది.

న్యాయమూర్తి, గైరమ్మకు క్రింది కోర్టువారు విధించిన శిక్ష రద్దు చేసివేశారు. భారత రాజ్యాంగం ప్రకారం పురుషునికి, స్త్రీకి సమానహక్కు ఉన్నదన్నారు. ఆడవాళ్ళయినంత మాత్రంచేత లైసెన్సు లివ్వకపోవడం సమంజసం కాదని,లైసెన్సులు పొందిన ఆడవాళ్ళు సూత్రాలకు కట్టుబడి ఉన్నప్పుడు, వాళ్ళను రచ్చకీడ్వడం న్యాయం కాదని సెలవిచ్చారు. కడమాటగా ఆమె వృత్తిని ఆమె చేపట్టి సక్రమంగా కాలం వెళ్ళబుచ్చుతూవుంటే ఎవ్వరూ అడ్డగూడదని, ఇలా అడ్డే వారెవరైనాఉంటే వైద్యశాలల్లో ఆడనర్సులు మగవాళ్ళకు పరిచర్యలు చేయడం సహించలేని బాపతే కాని మరొకరకం కాదని, పెదవి చివరల నుండి సన్నని నవ్వును వెలార్చారు. ఈ మాట విని అందరూ సంతోషించారు. జడ్జిమెంటు చాలా బాగుందంటే చాలా బాగుంది అన్నారు. నర్సులూ ఉండవలసిందే, రిక్షాలు తొక్కే యువతులూ ఉండవలసిందే అన్నారు.

ఈ వార్త రేడియో ద్వారా దేశమంతా పాకిపోయింది. పదిహేను సంవత్సరాలైనా నిండక ముందే భారతదేశంలోని స్త్రీలు అత్యద్భుతమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నారని లండన్‌లోని కొన్ని పత్రికలు వేనోళ్ళ కొనియాడాయి. ప్లీడరు శేషగిరి కీర్తి దశదిశలా వ్యాపించింది. ఆ సాయం కాలం అతన్ని వూరంతా వూరేగించారు. లీల తన భర్తను చూసి ఉప్పొంగిపోయింది.

కాంగ్రెస్ హైకమేండు, కమ్యూనిస్టు పార్టీ శక్రటరీ, గయిరమ్మదే న్యాయం అన్నారు. రిక్షా వాళ్ళ మూర్ఖపు పట్టుదలకు తల ఒగ్గగూడదన్నారు. చోటా నాయకులందరూ కాళ్ళు తొక్కుకున్నారు.

ఆ రాత్రి గైరమ్మ దీర్ఘంగా ఆలోచిస్తూ ఇంటిలో కూర్చుంది.

'ఇంకా ఎందుకే అమ్మా అలా ఉన్నావు... ఇంక రేపటి నుంచి పరవాలేదు కదే...' అన్నాడు పెద్దకుర్రాడు.

'నీకు తెలియదు నాయనా... రేపటి నుంచి మనరిక్షా మొగం ఎవ్వరూ సూడరు..'

'అదేమే... అమ్మా...'

'వాళ్ళకు భయం బాబూ'

'భయమెందుకే...'

'ఏమో తండ్రీ .. ఆళ్ళకి నన్ను సూత్తే వల్లమాలిన భయంగా ఉంది.'

'నువ్వన్నీ ఇలాగే సెప్తావు. ప్లీడరు గారు సెప్పారుగా రేపట్నించి హాయిగా మనం బతకొచ్చని'

'ఆయనలాగే సెప్తాడురా... కాని మన రిక్సా ఎవరూ ఎక్కరు బాబూ... ఆళ్లకి నీతిగా బతకడం అంటే భయం. అలా బతికే వోళ్ల దగ్గరికి ఆళ్లు రాలేరు. ఏం సేత్తాం' అంది.

తల్లి మాటలు ఆ కుర్రాడికి అర్థం కాలేదు. అలాగే తల్లి ఒడిలో నిద్రపోయాడు.

ఆ రాత్రి అస్తమించిపోతూన్న చంద్రుడు గిలగిలా కొట్టుకున్నాడు. వెనువెంటనే చిట్టచీకటి, కత్తి పుచ్చుకొని నిలబడింది.

గైరమ్మ బిడ్డలను దగ్గరగా లాక్కుంది. వారి ఒళ్ళు వెచ్చగా కాలుతున్నట్లనిపించింది. జ్వరం తగిలిందేమోనని నిద్రలోనే అనుకుంది. తిరిగి చేయి వేసింది. పిల్లవాడు కెవ్వుమన్నాడు. నిద్రమత్తును విసిరికొట్టి, కొట్టుకుంటూన్న గుండెలా చలించిపోతూ లేచింది. నెత్తిపై సూర్యుడు మండిపోతూన్నట్లుంది. కాళ్ళ క్రింద భయంకరమైన నీడలు పిచ్చి పిచ్చిగా రూపం మార్చుకుంటున్నాయి. ఆమె విహ్వాలంగా అరచింది.

నిప్పులలో ఉడికిపోతూన్న వంకాయలా ఆమె శరీరం ఉడికిపోవడం మొదలుపెట్టింది. ఏడుస్తూ తనను చుట్టుకొనిపోయిన బిడ్డలనిద్దరినీ ఎత్తుకుంది. ఆ తల్లి బాధ ఆ రాత్రి ఎలా చెప్పగలం? ఒక్క విసురుగా ఆమె తలుపు వద్దకు వెళ్ళింది. తలుపుకు బయట గొళ్ళం పెట్టబడి వుంది. ఆమె పైప్రాణం పైనే పోయింది. ఆ తలుపును గోళ్ళతో పట్టి పీకింది. గట్టిగా తన్నింది. 'మమ్మల్ని బతికించండి బాబూ! మమ్మల్ని బతికించండి' అని అరచింది. తన పొట్ట కింద బిడ్డలను పొదువుకొని తన తలతో 'కృష్ణా... కృష్ణా' అని ఆ తలుపును భయంకరంగా బాదింది. అప్పటికే ఆమె చేతులలోనే ఆ బిడ్డల ప్రాణవాయువులు గాలిలో కలసిపోయాయి. ఆమె చీరకు నిప్పంటుకుంది. ఒక్కసారి మంటలు తిరిగి చూరును తాకాయి. నక్షత్రాలు ఆకాశంలో ఎర్రగా మండిపోయాయి. ఆ తల్లిని, ఆ విప్లవమూర్తిని ఆ మంటల్లోంచి చేతులు చాచి అందుకున్నాయి.

(ఆంధ్రప్రభ, 28.9.1960)